అధికారులు నిర్లక్ష్యం వహిస్తే సహించం

జడ్పీ వైస్ చైర్మన్ పరికి ప్రేమ్‌కుమార్

మాట్లాడుతున్న జడ్పీ వైస్ చైర్మన్ పరికి ప్రేమ్‌కుమార్

బీబీపేట్, జనవరి 31 : రెవెన్యూ అధికారులు విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని జడ్పీ వైస్ చైర్మన్ పరికి ప్రేమ్‌కుమార్ హెచ్చరించారు. బీబీపేట్‌లోని రైతు వేదికలో ఎంపీపీ బాలమణి అధ్యక్షతన బుధవారం మండల సర్వ సభ్య సమావేశాన్ని ఎంపీడీవో పూర్ణచంద్రోదయకుమార్ నిర్వహించారు. ఈ సందర్భంగా పలు అభివృద్ధి కార్యక్రమాలపై చర్చించారు. అనంతరం జడ్పీ వైస్ చైర్మన్ మాట్లాడుతూ.. కల్యాణలక్ష్మి విషయంలో ఎందుకు నిర్లక్ష్యం చేస్తున్నారని నాయబ్ తహసీల్దార్ శృతిని అడిగారు. కింది స్థాయి సిబ్బందిని ఎందుకు ఇబ్బందులు పెడుతున్నారని అన్నారు. తహసీల్దార్ సత్యనారాయణ విధులకు ఎందుకు హాజరు కావడంలేదని ప్రశ్నించారు. అనంతరం జనగామ సర్పంచ్ రాజు, మాందాపూర్ సర్పంచ్ రేవతి మాట్లాడుతూ.. జనగామ నుంచి మాందాపూర్ వెళ్లే ఎడ్ల కట్టవాగుపై, మాందాపూర్ నుంచి పెద్దమల్లారెడ్డికి వెళ్లే రోడ్డులో బ్రిడ్జిని నిర్మించాలని కోరారు. పలు అభివృద్ధి అంశాలపై తీర్మానాలు చేశారు. అనంతరం పలువురు సర్పంచులను సన్మానించారు.

తాగు నీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకోవాలి

దోమకొండ, జనవరి 31 : గ్రామాల్లో రాబోయే వేసవిని దృష్టిలో పెట్టుకుని అధికారులు ప్రణాళికలు తయారు చేసుకో వాలని బుధవారం నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో ఎంపీపీ శారద, జడ్పీటీసీ తిర్మల్ గౌడ్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సర్పంచుల పదవీ కాలం ముగుస్తున్నందున వచ్చే ఎండాకాలంలో గ్రామాల్లో సమస్యలు లేకుండా పకడ్బందీగా చర్యలు తీసుకోవాలని సూచించారు. అధికారులు గ్రామాల్లో ఉన్న సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకోవాలన్నారు. వరి పంటకు తెగుళ్లు సోకకుండా తీసుకోవాల్సి జాగ్రత్తలపై గ్రామాల్లోని రైతులకు అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేయాలన్నారు. దోమకొండ నుంచి ముత్యంపేట్ మీదుగా కామారెడ్డి వరకు ఆర్ అండ్ బీ పనులు త్వరగా పూర్తవుతున్నాయని డీఈ తెలిపారు. ప్రభుత్వ దవాఖానలో సిబ్బంది సకాలంలో హాజరు కావాలని, చిన్న పిల్లలకు కుడా కామా రెడ్డి వెళ్లాల్సిన అవసరం లేకుండా వైద్య సేవలు అందిం చాలని సభ్యులు సూచించారు. అనంతరం ప్రజా కవి గద్దర్ జయంతి సందర్భంగా నివాళులర్పించారు. సర్పంచుల పదవీ కాలం ముగుస్తుండడంతో వారిని సత్కరించారు. సమావేశాల్లో ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

రగ్బీ పోటీలకు విద్యార్థుల ఎంపిక

రగ్బీ పోటీలకు ఎంపికైన క్రీడాకారులు

కామారెడ్డి, జనవరి 31: జిల్లా కేంద్రంలోని ఇందిరాగాంధీ స్టేడియంలో (అండర్-14) జిల్లా స్థాయి బాలబాలికల రగ్బీ పోటీలకు సెలక్షన్స్ బుధవారం నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి సుమారు 200 మంది క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. అత్యుత్తమ ప్రతిభ చూపిన వారిని రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేశారు. ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 2, 3, 4వ తేదీల్లో యాదాద్రి భువనగిరి జిల్లాలో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారు. కార్యక్రమంలో జిల్లా రగ్బీ గేమ్ సెక్రటరీ నీలం రవి, రంజిత్, సతీశ్, వ్యాయామ ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఎన్ఎస్ఎస్ శీతాకాల శిబిరాలు

బాన్సువాడ రూరల్, జనవరి 31 : బాన్సువాడ ప్రభుత్వ జూనియర్ కళాశాల బాలుర, బాలికల ఎన్ఎస్ఎస్ యూనిట్-1, 2 ఆధ్వర్యంలో మండలంలోని దేశాయిపేట్, సోమేశ్వర్ గ్రామాల్లో ఎన్ఎస్ఎస్ శీతాకాల శిబిరాలు రెండో రోజు కొనసాగాయి. దేశాయిపేట్ గ్రామంలో ఎన్ఎస్ఎస్ యూనిట్-1, సోమేశ్వర్ గ్రామంలోని ఎన్ఎస్ఎస్ యూనిట్-2 శిబిరాలు కొనసాగుతున్నాయి. పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడంతో రోగాలను దూరం చేయవచ్చని వలంటీర్లు గ్రామస్తులకు వివరించారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు యాదాగౌడ్, రుక్మిణీ, అధ్యాపకులు స్వప్న, దయానంద్, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పిస్తున్న విద్యార్థినులు

బాన్సువాడ టౌన్, జనవరి 31 : దీర్ఘకాలిక, సీజనల్ వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలని ప్రభుత్వ నర్సింగ్ కళాశాల లెక్చరర్ స్వర్ణలత అన్నారు. బాన్సువాడలోని శాంతినగర్ అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులు, బాలింతలకు సంపూర్ణ ఆరోగ్యం కోసం తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి బాన్సువాడ ప్రభుత్వ బీఎస్సీ నర్సింగ్ కళాశాల విద్యార్థినులతో కలిసి బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా లెక్చరర్ స్వర్ణలత మాట్లాడుతూ.. గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. బలహీనంగా ఉంటే పిల్లలు అనారోగ్యంతో పుడతారని తెలిపారు. ఈ సందర్భంగా నర్సింగ్ కళాశాల విద్యార్థినులు ఆరోగ్యం, వ్యాధుల నివారణ గురించి చార్టులతో అవగాహన కల్పించారు. అంగన్‌వాడీ టీచర్ అరుణ, ఆయమ్మ సలీమా, విద్యార్థినులు తదితరులు పాల్గొన్నారు.

ఓటీఎస్ గడువు
పొడిగింపు

బాన్సువాడ, జనవరి 31 : నిజామాబాద్ జిల్లా సహకార కేంద్ర బ్యాంకు వన్ టైం సెటిల్‌మెంట్ (ఓటీఎస్) పొడిగించినట్లు డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రైతుల అభ్యర్థన మేరకు ప్రవేశపెట్టిన ఓటీఎస్ జనవరి 31న ముగిసినప్పటికీ.. చాలా మంది రుణాలు చెల్లించాల్సి ఉన్నందున గడువును మార్చి 31వ తేదీ వరకు పొడిగించినట్లు తెలిపారు. అర్హులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని, బ్యాంకు అభివృద్ధికి సహకరించాలని డీసీసీబీ చైర్మన్ కోరారు. మరిన్ని వివరాల కోసం సంబంధిత సొసైటీ మేనేజర్లను సంప్రదించాలని సూచించారు.

అవగాహన కోసమే మోడల్ టెస్ట్

బాన్సువాడ టౌన్, జనవరి 31 : విద్యార్థులు పరీక్షలు ఎలా రాయాలనే విషయమై అవగాహన కల్పించడమే ఈ మోడల్ టెస్ట్ ముఖ్య ఉద్దేశమని ఏఎస్ఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు సంతోష్ తెలిపారు. బాన్సువాడలోని ఆర్ అండ్ బీ అతిథి గృహంలో ఏఎస్ఆర్ ఫౌండేషన్ సభ్యులు బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పరీక్షను ఎలా రాయాలి, గురుకులం, నవోదయ లాంటి పరీక్షలు ఎలా కొనసాగుతాయనే విషయంపై అవగాహన కల్పించనున్నామని తెలిపారు. ఈ నెల 4వ తేదీన ఉదయం 10 గంటలకు బాన్సువాడ సాయికీర్తి జూనియర్ కళాశాలలో ఉచిత మోడల్ టెస్టును నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ పరీక్ష రాసే విద్యార్థులు 7386965601 నంబర్‌కు ఫోన్ చేసి రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. ఏఎస్ఆర్ ఫౌండేషన్ జిల్లా నాయకుడు సాయిలు, సభ్యులు బాలకృష్ణ, సాయికుమార్, సాయిలు, పర్వయ్య, రాజు తదితరులు పాల్గొన్నారు.

ఆరోపణలు తగవు

- కాంగ్రెస్ నాయకులు వాస్తవాలు తెలుసుకోవాలి
- విలేకరుల సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు

మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులు

బాన్సువాడ టౌన్, జనవరి 31: బాన్సువాడ మండలం బోర్లం గ్రామంలోని బీడీ వర్కర్స్ కాలనీ గురించి కొన్నిరోజులుగా కాంగ్రెస్ నాయకులు చేస్తున్న ఆరోపణలు వాస్తవం కాదని రైతుబంధు సమితి జిల్లా కన్వీనర్ అంజిరెడ్డి అన్నారు. రాజకీయ లబ్ధికోసం పేదలను బలిచేయడం తగదన్నారు. బుధవారం ఆయన బాన్సువాడలోని బీఆర్ఎస్ కార్యాలయంలో పార్టీ నాయకులతో కలిసి మాట్లాడారు. బోర్లం గ్రామంలో బీఆర్ఎస్ ప్రభుత్వం 64 మంది లబ్ధిదారులకు ప్లాట్లు కేటాయించడంతో పాటు డబుల్ బెడ్రూం కట్టుకునే వారికి ఇండ్లను మంజూరు చేసిందని, ఇందులో ఆరుగురు ఇండ్ల నిర్మాణం కూడా పూర్తి చేసుకున్నారని తెలిపారు. కానీ కాంగ్రెస్ పార్టీకి చెందిన నాయకులు ఇండ్లు కట్టుకొని లబ్ధిదారులను రెచ్చగొట్టి ఖాళీ ప్లాట్లకు పట్టాలను ఇవ్వాలని మీడియా ముందుకు తీసుకురావడం వారి అవగాహన లోపానికి నిదర్శనమని పేర్కొన్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ప్రభుత్వ స్థలంలో ఇండ్లు కట్టుకున్న వారికి మాత్రమే పట్టాలను అందిస్తారనే విషయం తెలియని సదరు నాయకులు తమ రాజకీయ మనుగడ కోసం పేదలను బలి చేస్తున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. ఇచ్చిన మాట ప్రకారం ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి ఇండ్లు కట్టుకున్న వారందరికీ పట్టాలను ఇప్పించే బాధ్యత తనది అని ఎన్నోసార్లు చెప్పారని గుర్తుచేశారు. సమావేశంలో మున్సిపల్ చైర్మన్ గంగాధర్, మార్కెట్ కమిటీ చైర్మన్ నర్సింహులు, సొసైటీ చైర్మన్ కృష్ణారెడ్డి, మండల సీనియర్ నాయకులు దొడ్ల వెంకట్‌రాంరెడ్డి, శ్రీధర్, బాన్సువాడ రెడ్‌క్రాస్ అధ్యక్షుడు బోర్లం శ్రీనివాస్, బీఆర్ఎస్ మండల, పట్టణ కార్యదర్శులు రాజేశ్వర్, లింగమేశ్వర్, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, స్థానిక బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరిస్తాం
ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి

కార్మికులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి

కామారెడ్డి, జనవరి 31 : కామారెడ్డి మున్సిపల్‌లోని పారిశుద్ధ్య సిబ్బందికి జీతాలు సరిగా రావడం లేదని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ఎదుట బుధవారం ధర్నా నిర్వహించారు. ఎమ్మెల్యే కాటిపల్లి అక్కడికి చేరుకొని వారి సమస్యలను తెలుసుకున్నారు. వేతనాలు త్వరగా చెల్లించేలా అధికారులు చర్యలు తీసుకుంటారని హామీ ఇచ్చారు. అనంతరం మున్సిపల్ అధికారులతో క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే సమావేశం నిర్వహించారు. వేసవిలో నీటి ఇబ్బందులు లేకుండా ఇప్పటి నుంచే ప్రణాళిక సిద్ధం చేసుకోవాలన్నారు. మున్సిపల్ కమిషనర్ దేవేందర్, అధికారులు, కార్మికులు పాల్గొన్నారు.

ఆర్థిక సహాయం అందజేత

దోమకొండ, జనవరి 31 : మండలంలోని ముత్యంపేట గ్రామానికి చెందిన రైతు బొబ్బిలి దుర్గయ్య పంట సాగుకు బోర్లు వేసి అప్పులపాలై ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ విషయం తెలిసి రైతు సంక్షేమ సమితి తరపున రిటైర్డు హైకోర్ట్ జడ్జి జస్టిస్ చంద్ర కుమార్ గ్రామ పెద్దల సమక్షంలో రూ. 10 వేల ఆర్థిక సహాయం అందజేశారు. రైతు సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఇంద్రసేన, తెలంగాణ రైతు సంక్షేమ సమితి నాయకులు రఘునాథ్, లింగ నాయక్, ప్రభు పాల్గొన్నారు.

జీవితంపై విరక్తితో ఒకరి ఆత్మహత్య

నస్రుల్లాబాద్, జనవరి 31 : మండలంలోని దుర్కి గ్రామానికి చెందిన మామిడి రాములు(65) జీవితంపై విరక్తితో ఆత్మహత్య చేసుకున్నట్లు ఏఎస్సై వెంకట్రావ్ తెలిపారు. ఏఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. మామిడి రాములు కొన్ని సంవత్సరాలుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. దీంతో జీవితంపై విరక్తి చెంది ఇంటి పక్కన ఉన్న బావిలో బుధవారం దూకి ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిపారు. మృతుడి భార్య సాయవ్వ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై తెలిపారు.

బీజేపీలో చేరిన పారిశ్రామికవేత్తలు

హైదరాబాద్, జనవరి 31 (నమస్తే తెలంగాణ): రాష్ర్టానికి చెందిన పలువురు పారిశ్రామికవేత్తలు బుధవారం ఢిల్లీలో కేంద్రమంత్రి కిషన్ రెడ్డి, బీజేపీ జాతీయ కార్యవర్గసభ్యుడు ఈటల రాజేందర్ సమక్షంలో బీజేపీలో చేరారు. ఖమ్మం జిల్లాకు చెందిన బిల్డర్ తాండ్ర వినోద్ రావు, జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గానికి చెందిన సైంటిస్ట్, ఫార్మా కంపెనీ యజమాని పైడి ఎల్లారెడ్డి, వరంగల్‌కు చెందిన బ్యాంకింగ్ నిపుణులు గాండె సుధాకర్ పార్టీలో చేరారని ఈటల తెలిపారు. ప్రధాని మోదీ పది సంవత్సరాల పాలన చూసి చాలామంది బీజేపీలో చేరేందుకు ముందుకు వస్తున్నారని అన్నారు.

జిల్లాలో పశువైద్య శిబిరాలు

జిల్లా పశువైద్యాధికారి నర్సింహారావు

అమర్లబండలో శిబిరాన్ని ప్రారంభిస్తున్న అధికారి

సదాశివనగర్, జనవరి 31: జిల్లాలో పశువులకు గర్భకోశ వ్యాధి నివారణ కోసం ఉచితంగా వైద్యం అందిస్తున్నామని జిల్లా పశువైద్యాధికారి నర్సింహారావు అన్నారు. మండలంలోని అమర్లబండ గ్రామంలో విజయ డెయిరీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత పశు వైద్య శిబిరాన్ని సర్పంచ్ లత రాజేశ్వర్, విజయ డెయిరీ అధ్యక్షుడు కిషన్‌రావుతో కలిసి ఆయన బుధవారం ప్రారంభించారు. పశువులకు అల్ట్రా సోనోగ్రఫీ మిషన్ ద్వారా నొప్పి లేకుండా చికిత్స అందిస్తున్నామని తెలిపారు. జిల్లాలో ఇప్పటివరకు 37 గ్రామాల్లో ఉచిత పశువైద్య శిబిరాలను ఏర్పాటు చేసి 720 పశువులకు చికిత్సలు చేశామని తెలిపారు. 820 దూడలకు నట్టల నివారణ మందు వేశామన్నారు. ప్రతి ఇంట్లో పాడిపశువును పెంచి ఆర్థికంగా అభివృద్ధి చెందాలని సూచించారు. నట్టల నివారణ మందు వేసి పశు సంపద పెంచేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ కొత్తూరు లతా రాజేశ్వర్, జిల్లా పశు గణాభివృద్ధి అధికారి మాజిద్, ఏడీ డాక్టర్ సంజయ్ కుమార్, మండల పశు వైద్యాధికారి రమేశ్ నాయక్, డాక్టర్ రవికిరణ్, అడ్లూర్ ఎల్లారెడ్డి విజయ డెయిరీ బీఎంసీ మేనేజర్ యాడారం రమేశ్ చారి, పశుగణ సహాయకుడు జుగల్ కిశోర్, గోపాలమిత్రలు రాజేశ్వర్, మురళి, కాశీరెడ్డి, మహిపాల్, డెయిరీ సూపర్‌వైజర్ రాజేశ్, టెస్టర్ రాములు, గణపతి రావు, రమేశ్, పశు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పార్టీలకు అతీతంగా అభివృద్ధి చేసుకుందాం..

- ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్
- నాగిరెడ్డిపేట, గాంధారి మండలాల్లో పలు అభివృద్ధి పనుల ప్రారంభం
- దివ్యాంగులకు స్కూటీల పంపిణీ

బొల్లారంలో సబ్‌స్టేషన్‌ను ప్రారంభిస్తున్న ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు

ఎల్లారెడ్డి, జనవరి 31: పార్టీలకు అతీతంగా నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసుకుందామని ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్ అన్నారు. నాగిరెడ్డిపేట మండలంలోని బొల్లారం శివారులో రూ.కోటి25లక్షల వ్యయంతో నిర్మించిన విద్యుత్ సబ్ స్టేషన్‌ను ఆయన బుధవారం ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. పోచారం ప్రాజెక్టును పర్యాటకంగా అభివృద్ధి చేయాల్సి ఉందన్నారు. తనకు వద్దకు ఎవరు వచ్చినా సేవలను అందిస్తానని తెలిపారు. అనంతరం నాగిరెడ్డిపేట మండలంలోని వెంకంపల్లి, ధర్మారెడ్డి గ్రామాల్లో రూ.40లక్షలతో నిర్మించిన గ్రామ పంచాయతీ భవనాలను ఎమ్మెల్యే ప్రారంభించారు. స్థానిక సర్పంచులకు ఆయన అభినందనలు తెలిపారు. ఆయా కార్యక్రమాల్లో ఎంపీపీ రాజ్‌దాస్, జడ్పీటీసీ మనోహర్‌రెడ్డి తాండూర్ పీఏసీఎస్ చైర్మన్ గంగారెడ్డి, సర్పంచులు సుభాకర్‌రెడ్డి, శ్రీధర్‌గౌడ్, ఎంపీడీవో రఘు, పలువురు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు ప్రారంభం..

గాంధారి, జనవరి 31: మండలంలోని పోతంగల్ కలాన్, బీర్మల్‌తండాల్లో పలు అభివృద్ధి పనులను ఎమ్మెల్యే మదన్‌మోహన్ బుధవారం ప్రారంభించారు. పోతంగల్ కలాన్ నుంచి కర్ణంగడ్డ తండా వరకు రూ.4 కోట్ల 32లక్షలతో చేపట్టే బీటీ రోడు పనులకు శంకుస్థాపన చేశారు. బీర్మల్ తండాలో రూ.20 లక్షలతో నిర్మించిన గ్రామ పంచాయతీ భవనాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో పోతంగల్ కలాన్, బీర్మల్ తండా సర్పంచులు వడ్ల బాలరాజు, దర్బార్ నాయక్, ఎంపీటీసీలు కుమ్మరి రాములు, బాలరాజు, తూర్పు రాజులు, నాయకులు ముకుంద్ రావు, మోహన్‌నాయక్, బెజుగం సంతోష్, సంగని బాలయ్య ,పరమేశ్, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు స్కూటీల పంపిణీ..

ఎల్లారెడ్డి రూరల్, జనవరి 31: దివ్యాంగులకు ప్రభుత్వం సరఫరా చేసిన స్కూటీలను ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు బుధవారం ఎల్లారెడ్డిలోని క్యాంప్ కార్యాలయంలో పంపిణీ చేశారు. ఎల్లారెడ్డి మండలానికి చెందిన ఇద్దరికి, గాంధారి, లింగంపేట మండలాలకు చెందిన ఒకరి చొప్పున మొత్తం నలుగురికి దివ్యాంగుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అందజేశారు. ఎల్లారెడ్డి, గాంధారి, లింగంపేట, తాడ్వాయి, రాజంపేట, సదాశివనగర్ మండలాలకు చెందిన ఒక్కొక్క దివ్యాంగుడికి వంద శాతం సబ్సిడీపై రూ.50వేల విలువైన చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి బావయ్య, ఆర్డీవో మన్నె ప్రభాకర్, సీడీపీవో సరిత, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

జీపీ పాలకవర్గాలకు సన్మానం

బాన్సువాడ రూరల్/డోంగ్లీ, జనవరి 31 : గ్రామ పంచాయతీ పాలకవర్గాల పదవీకాలం ముగియడంతో బాన్సువాడ మండలంలోని బుడ్మి, తాడ్కోల్, దేశాయిపేట్, కొనాపూర్, హన్మాజీపేట్ తదితర గ్రామాల్లో సర్పంచులు, వార్డు మెంబర్లను బుధవారం సన్మానించారు. వారికి శాలువా కప్పి పూలమాలలతో సన్మానం చేశారు. సర్పంచులు శ్రావణ్ కుమార్, లక్ష్మి, రాజమణి, బోనాల సుభాష్, వెంకటరమణారావు తదితరులు పాల్గొన్నారు. డోంగ్లీ మండలంలోని మొఘ పంచాయతీ పాలకవర్గ సభ్యులు గ్రామాభివృద్ధికి చేసిన కృషిని కొనియాడారు. కార్యక్రమంలో నాయకులు బస్వంత్ తుపకవార్, బస్వంత్‌రావు పాటిల్, సంతోష్ పాటిల్, మాధవ్‌రావు పాటిల్, దిలీప్‌కుమార్ పాల్గొన్నారు.

హైదరాబాద్ తరలిన స్టాఫ్ నర్సులు

బిచ్కుంద, జనవరి 31: కొన్ని ఏండ్లుగా కాంట్రాక్ట్ పద్ధతిలో విధులు నిర్వహించిన తొమ్మిది మంది స్టాఫ్ నర్సులు ప్రభుత్వం నిర్వహించిన పరీక్షలో ఉత్తీర్ణులయ్యారు. దీంతో వారు సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా ఆర్డర్ కాపీలను తీసుకునేందుకు బుధవారం హైదరాబాద్ తరలివెళ్లారు. ఎల్బీ స్టేడియంలో నిర్వహించే కార్యక్రమంలో సీఎం వారికి ఆర్డర్ కాపీలను అందజేస్తారని డివిజన్ ఆరోగ్య బోధకుడు దస్తీరాం తెలిపారు. నియోజకవర్గం నుంచి 45 మంది స్టాఫ్ నర్సులు హైదరాబాద్ వెళ్లారు. వారితోపాటు డాక్టర్ శిరీష, హెచ్ఈ సుధాకర్, ఎంపీహెచ్ఈవో పరమేశ్వర్, పోలీసు సిబ్బంది శోభ ఉన్నారు.

అంగన్‌వాడీ కేంద్రం తనిఖీ

నిజాంసాగర్, జనవరి 31: మండలంలోని ఆరేపల్లి అంగన్‌వాడీ కేంద్రాన్ని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లక్ష్మి బుధవారం తనిఖీ చేశారు. కేంద్రంలోని రికార్డులను పరిశీలించారు. చిన్నారులకు బొమ్మల ద్వారా జంతువుల పేర్లను వివరించారు. ఆమెవెంట కార్యకర్త మైశకళ ఉన్నారు.

గాంధీ విగ్రహావిష్కరణ

నిజాంసాగర్, జనవరి 31: మండలంలోని వెల్గనూర్‌లో ఏర్పాటు చేసిన గాంధీ విగ్రహాన్ని బుధవారం స్థానిక నాయకులు ఆవిష్కరించారు. కార్యక్రమంలో సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు అనిల్ గౌడ్, నాయకులు అనిల్‌కుమార్, సొసైటీ చైర్మన్ నర్సింహారెడ్డి, ఉప సర్పంచ్ హన్మంత్‌రెడ్డి, మాజీ సర్పంచ్ ఆనంద్‌కుమార్, పంచాయతీ కార్యదర్శి గంగాసాగర్ తదితరులు పాల్గొన్నారు.

తిప్పారం తండాలో సరస్వతీ విగ్రహం..

గాంధారి, జనవరి 31: మండలంలోని తిప్పారం తండా ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో సరస్వతీ విగ్రహాన్ని బుధవారం ప్రతిష్ఠించారు. విగ్రహ దాత బీర్మల్ నాయక్‌కు ఉపాధ్యాయులు, తండావాసులు శాలువా కప్పి సన్మానించారు. కార్యక్రమంలో ఎంఈవో సేవ్లా నాయక్, సర్పంచ్ సుందరీబాయి బిషన్‌నాయక్, గాంధారి సింగిల్ విండో వైస్ చైర్మన్ ఉద్దల్‌సింగ్, ఎస్ఎంసీ చైర్మన్ పెంటయ్య, టికారాం, గంగారాం, ఉపాధ్యాయులు రవి, స్వప్న, ప్రకాశ్, అంగన్‌వాడీ టీచర్ శారద తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనులపై కూలీలకు అవగాహన కల్పించాలి

పెద్ద కొడప్‌గల్, జనవరి 31: ఉపాధి హామీ పనులపై కూలీలకు అవగాహన కల్పించాలని ఎంపీడీవో రాణి ఫీల్డ్ అసిస్టెంట్లకు సూచించారు. మండలంలోని బూర్గుపల్లిలో చేపడుతున్న ఉపాధి పనులను ఆమె బుధవారం పరిశీలించారు. కొలతల ప్రకారం పనులు చేయాలని కూలీలకు సూచించారు. పనిచేయని వారికి హాజరు వేస్తే ఫీల్డ్ అసిస్టెంట్లపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆమెవెంట ఏపీవో సుదర్శన్ తదితరులు ఉన్నారు.

NAMASTHE TELANGANA CLASSIFIEDS
నమస్తే తెలంగాణ CLASSIFIEDS క్లాసిఫైడ్స్

WANTED
★సూర్య ఎంటర్‌ప్రైజెస్: టూత్‌బ్రష్, పెన్స్, కాటన్ విక్స్, మిషన్స్‌పై ప్రతినెలా అధిక ఆదాయం, 50% తిరిగి కొనుగోలు, టూత్‌బ్రష్, స్క్రబ్బర్, పెన్స్ కొరకు జిల్లాల వారీగా డీలర్స్ కావలెను. 7794907692.
NT-311506

WANTED
★హరేకృష్ణ హోంకేర్, హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం, జీతం: 16K to 18K, ఏజెంట్ కమీషన్: 6K. 9640468899 / 9640258899.
NT-319428-All

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
4 లైన్ల క్లాసిఫైడ్స్ 200/- మాత్రమే.
ప్రతి అదనపు లైనుకు 50/- మాత్రమే
"పేరు మార్పిడి" ప్రకటన
4 లైన్లకు 250/-
ప్రతి అదనపు లైనుకు 50/- మాత్రమే
GST వర్తించును
సెల్ : 91827 77590

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

డైజోఫాం పట్టివేత

ఎల్లారెడ్డి రూరల్, జనవరి 31: అన్నాసాగర్ శివారులో అనుమానాస్పదంగా తిరుగుతున్న వ్యక్తి నుంచి 460గ్రాముల డైజోఫాం స్వాధీనం చేసుకున్నామని ఎక్సైజ్ సీఐ శాకీర్ అహ్మద్ తెలిపారు. ఎల్లారెడ్డి ఎక్సైజ్ కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. అన్నాసాగర్ గ్రామ శివారులో ఎరుపాజి మొగులా గౌడ్ అనుమానాస్పదంగా కనిపించడంతో కామారెడ్డి డీటీఎఫ్, ఎల్లారెడ్డి ఎక్సైజ్ సిబ్బంది కలిసి తనిఖీ చేశారని తెలిపారు. అతని వద్ద 460 గ్రాముల డైజోఫామ్ లభించిందన్నారు. నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. సమావేశంలో డీటీఎఫ్ సీఐ సుందర్ సింగ్, ఎల్లారెడ్డి ఎక్సైజ్ ఎస్సై జలీలుద్దీన్, సిబ్బంది పాల్గొన్నారు.

లక్ష్మణ్‌రాథోడ్‌కు అబ్దుల్ కలామ్ అవార్డు

లక్ష్మణ్‌రాథోడ్‌ను సన్మానిస్తున్న నిర్వాహకులు

గాంధారి, జనవరి 31: మండలంలోని పోతంగల్ కలాన్ ప్రభుత్వ పాఠశాలలో వ్యాయామోపాధ్యాయుడిగా పనిచేస్తున్న లక్ష్మణ్ రాథోడ్ ఏపీజే అబ్దుల్ కలామ్ రాష్ట్ర స్థాయి అవార్డు అందుకున్నారు. వాలీబాల్, షూటింగ్ బాల్‌లో పలువురు విద్యార్థులు రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించేలా ఆయన తీర్చిదిద్దుతున్నారు. దీంతో ఆయనకు నిర్మల్ జిల్లాలోని మా అమ్మ, నాన్న ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఆంజనేయులు ప్రతిష్ఠాత్మక ఏపీజే అబ్దుల్ కలామ్ అవార్డును అందజేశారు. ఈ సందర్భంగా లక్ష్మణ్ రాథోడ్‌ను తోటి ఉపాధ్యాయులు, ప్రజా ప్రతినిధులు అభినందించారు. కార్యక్రమంలో శ్రీసాయి అనాథ ఆశ్రమ వ్యవస్థాపకుడు అశోక్ తదితరులు పాల్గొన్నారు.

జుక్కల్ ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావును రైస్‌మిల్ అసోసియేషన్ బాధ్యులు బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి, పలు అంశాలపై చర్చించారు.

రహదారికి మరమ్మతులు

నిజాంసాగర్/ పిట్లం, జనవరి 31: పిట్లం - బాన్సువాడ, బొగ్గుగుడిసె చౌరస్తా - నర్సింగ్‌రావు పల్లి చౌరస్తా మధ్య రహదారిపై ఏర్పడిన గుంతలను ఆర్అండ్‌బీ అధికారులు పూడ్చి వేయిస్తున్నారు. రోడ్డుపై గుంతలు ఏర్పడడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. రోడ్డు బాగుచేస్తుండడంతో వారు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. పనులను ఆర్అండ్‌బీ వర్క్ ఇన్‌స్పెక్టర్ జయరావు బుధవారం పరిశీలించారు.

బాధ్యతలు చేపట్టిన సీఐలు



ఎల్లారెడ్డి సీఐగా బాధ్యతలను స్వీకరిస్తున్న రవీంద్రనాయక్



సీఐ నరేశ్‌కు బొకేను అందజేస్తున్న బిచ్కుంద ఎస్సై మురళి

ఎల్లారెడ్డి/ బిచ్కుంద, జనవరి 31: ఎల్లారెడ్డి సీఐగా రవీంద్రనాయక్ ఇక్కడ సీఐగా పనిచేస్తున్న శ్రీనివాస్ నుంచి బుధవారం బాధ్యతలను స్వీకరించారు. నిర్మల్ జిల్లాలో పనిచేసిన రవీంద్ర నాయక్‌ను ప్రభుత్వం ఎల్లారెడ్డికి బదిలీ చేసింది. ఇక్కడ సీఐగా పనిచేస్తున్న శ్రీనివాస్ ఐజీ కార్యాలయానికి బదిలీ అయ్యారు. బిచ్కుంద సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా జగడం నరేశ్ బుధవారం బాధ్యతలను స్వీకరించారు. ఆయన సిద్దిపేట టాస్క్‌ఫోర్స్ సీఐగా పనిచేసి బదిలీపై బిచ్కుందకు వచ్చారు. ఇక్కడ సీఐగా పనిచేసిన బోయిన కృష్ణ ఐజీ కార్యాలయానికి బదిలీ అయ్యారు. సీఐ నరేశ్‌కు బిచ్కుంద ఎస్సై మురళి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

ఎల్లారెడ్డి ఎస్సైగా మహేశ్..

ఎల్లారెడ్డి, జనవరి 31: ఎల్లారెడ్డి ఎస్సైగా బొజ్జ మహేశ్ బుధవారం బాధ్యతలను స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న గణేశ్‌ను ప్రభుత్వం బదిలీ చేసింది. బాధ్యతలను స్వీకరించిన మహేశ్‌కు పోలీసు సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

ఎల్లారెడ్డి రూరల్, జనవరి 31: మండలంలోని అడ్విలింగాల్ గేటు సమీపంలో మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో లింగంపేట మండలం జల్దిపల్లి గ్రామానికి చెందిన గాండ్ల రాజు(28) మృతిచెందాడు. ఎస్సై గణేశ్ తెలిపిన ప్రకారం.. ఎల్లారెడ్డిలోని ఓ మొబైల్ దుకాణంలో పనిచేసే రాజు విధులు ముగించుకొని పల్సర్ బైక్‌పై ఇంటికి బయల్దేరాడు. అడ్విలింగాల్ గేట్ సమీపంలో ఎదురుగా వస్తున్న ట్రాక్టర్ ఢీకొని రాజు తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు 108 అంబులెన్స్‌లో ఎల్లారెడ్డి ప్రభుత్వ దవాఖానకు తరలించగా.. చికిత్స పొందుతూ మృతిచెందాడు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.